క్లుప్తంగా

ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో చదవాలని బంగారుతల్లి ప్రేరణ అంబాసిడర్, ట్రైనర్ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, కెరియర్ గైడెన్స్, స్టడీ స్కిల్స్, ప్రభుత్వ పాఠశాల గొప్పతనాన్ని, జీవితంలో విజయం సాధించే అంశాలపై ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం వారికి పలు క్విజ్ పోటీలను నిర్వహించి ఎంఈఓ వెంకటేశం చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దిరాములు తదితరులున్నారు.

తాత్కాలిక మరమ్మతులు ప్రారంభం



తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి కుంగింది. దీంతో మెదక్ – సిద్దిపేట జాతీయ రహదారి 765 డి పనులు పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే వాహనాదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పనున్నాయి. నందిగామ గ్రామ శివారులో కుంగిన బ్రిడ్జికి ప్రక్కనే మరో మట్టి రోడ్డును నిర్మిస్తున్నారు.

వరద బాధితులకు సరుకులు

రామాయంపేట(మెదక్): భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులకు మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా గవర్నర్ అమర్నాథ్, స్థానిక సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజు బాధితులకు అందజేశారు. క్లిష్ట పరిస్థితుల్లో బాధితులను ఆదుకోవడం గొప్ప విషయమని సీఐ పేర్కొన్నారు. క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. క్లబ్ ప్రతినిధులు దీప్‌చంద్, దామోదర్‌రావు, శ్రీనివాసరావు, బాలరాజు, గురువయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రేగోడ్(మెదక్): నంబర్ ప్లేట్ లేకుండా కనిపిస్తే వాహనాన్ని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పోచయ్య హెచ్చరించారు. మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో నంబర్ ప్లేట్ లేని నాలుగు వాహనాలను పట్టుకుని వాహనాలకు నంబర్ వేయించి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు సీట్ బెల్ట్, హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో 20 మందికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు చేసింది. మంగళవారం చెక్కులను వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు బల్‌రాం, సుభాశ్‌రావ్, నర్సింహరెడ్డి, బాలకిషన్, బేతయ్య, పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంటసాగుపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం హెచ్ఈఓ విఠల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంటను సాగు చేయడం ద్వారా దీర్ఘకాలికంగా లబ్ధి పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సాగు పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని హెచ్ఈఓ విఠల్ కోరారు.

అవినీతిపరులకు శిక్ష తప్పదు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపరులకు శిక్ష తప్పదని డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై పీసీ ఘోష్ నివేదికను ప్రభుత్వం సీబీఐకి ఇచ్చిందన్నారు. త్వరలోనే అవినీతిపరులు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

నేలపైనే భోజనం!

- అటకెక్కిన మన ఊరు–మనబడి
- మధ్యలోనే నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తూప్రాన్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన డైనింగ్ హాల్ భవనం

తూప్రాన్: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో తీసుకొచ్చిన మన ఊరు–మన బడి పథకం అటకెక్కింది. ఈ పథకం కింద ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులు నిలిచిపోయాయి. ఇందులో డైనింగ్ హాల్ నిర్మాణాలకు నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో విద్యార్థులు నేలపైనే భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా మెదక్ జిల్లాలో మన ఊరు–మన బడి పథకానికి నిధుల కొరత వేధిస్తుంది. ఈ మేరకు పలు పాఠశాలల్లో డైనింగ్ హాల్ నిర్మాణాలు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ పథకం కింద మెదక్ జిల్లాలో 142 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 85 ఉన్నత పాఠశాలలకు డైనింగ్ హాల్స్ మంజూరయ్యాయి. వీటిలో 18 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో పునాది, బెస్‌మెంట్, గోడలు పూర్తవ్వగా.. మిగతా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ డైనింగ్ హాల్స్ నిర్మాణానికి 2022–23 విద్యా సంవత్సరంలో గత ప్రభుత్వం ప్రారంభించింది. మన ఊరు–మన బడి పథకం ద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ఒక్కో పాఠశాలకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు కేటాయించింది. కానీ ఆ తర్వాత కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పేరుతో మరో పథకాన్ని తీసుకొచ్చింది. అయితే ఈ పథకంలో మన ఊరు–మన బడి కింది నియామకమైన పాఠశాలలు కాకుండా ఇతర పాఠశాలలను ఎంపిక చేయడంతో డైనింగ్ హాల్స్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు. డైనింగ్ హాల్స్ నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులంతా ఒకే చోట బల్లలపై కూర్చొని క్రమశిక్షణతో భోజనాలు చేస్తారు. విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్స్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిధుల కొరతతో నిలిచాయి



ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపట్టిన డైనింగ్ హాల్స్ నిర్మాణ పనులు నిధుల కొరతతో నిలిచాయి. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేస్తే అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతాం.

– రాధా కిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్



అదనపు కలెక్టర్ నగేశ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

అదనపు కలెక్టర్‌కు సన్మానం

మెదక్ కలెక్టరేట్: అదనపు కలెక్టర్ నగేశ్ పుట్టిన రోజును పురస్కరించుకొని టీఎన్‌జీఓస్, టీపీఎస్ పీడీఎఫ్ నాయకులు ఆయనను సన్మానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జంగం నగేష్‌కుమార్, మహ్మద్ నయీం, ఖాసీం, లింగం, నారాయణ, సంతోష్, రాజ్యం, ప్రసాద్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తుది ఓటరు జాబితా ప్రదర్శించామని ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామ పంచాయతీల్లో సైతం వార్డుల వారీగా తుది ఓటరు జాబితా అందుబాటులో ఉంచామన్నారు. ఇకపై ఎలాంటి మార్పులు, చేర్పులకు అవకాశం లేదన్నారు. మండల వ్యాప్తంగా 156 వార్డుల్లో 17,840 ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న తిరుపతి తదితరులు



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దాతల సహకారం తోడైతే మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎం.జలాల్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రంగి కృష్ణ సుమారు వంద మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేయగా, డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సీతారాం, రిటైర్డ్ ఎంఈఓ యాదగిరి, హెచ్ఎం సురేశ్‌కుమార్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ప్రణీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం



ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నర్సాపూర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కలిపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం పార్టీ చేపట్టిన సంబరాలలో భాగంగా స్థానిక పిల్లల పార్కులోని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు ముజాహిద్ ఆలంఖాన్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. తమ నేత రాహుల్ గాంధీ సూచనల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేశారని వారు అన్నారు. ఈ విషయంలో రాష్ట్రం దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. సంబరాలలో భాగంగా మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమేనని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. మంగళవారం ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమితో కుంగిపోకుండా, ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం లేదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుంజయ్య, జెడ్పీ పాఠశాల హెచ్ఎంలు రమేశ్, లక్ష్మణ్, నర్సింలు, రవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, పీఆర్టీయూ నాయకులు జనార్దన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామిరెడ్డి, ఎంఈఓ బుచ్చనాయక్, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోమారం హై స్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .చదువుతో పాటు ఆటల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రయాణ, ఇతర ఖర్చుల నిమిత్తం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి రూ.20 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో...

నర్సాపూర్: మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీలను మంగళవారం స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో ఎంఈఓ తారాసింగ్ ప్రారంభించారు. పోటీల్లో పలు పాఠశాలల నుంచి సుమారు ఐదు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వర్షంతో నిలిచిన క్రీడలు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను యువనాయకుడు అహ్మద్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు చదువుల్లో భాగం కావాలన్నారు. అనంతరం వర్షం ప్రారంభం కావడంతో ఆటల పోటీలను వాయిదా వేశారు. హెచ్ఎం మహేశ్వర్ ,పీఈటీలు, విద్యార్థులు, టీచర్లు ,క్రీడాకారులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

శివ్వంపేట(నర్సాపూర్): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చంద్రగౌడ్‌లు అన్నారు. మంగళవారం శివ్వంపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ కవిత చేసిన వాఖ్యలను ఈ సందర్భంగా వారు తీవ్రంగా ఖండించారు.

కాళేశ్వరంపై ఆరోపణలు మానుకోవాలి



అల్లాదుర్గం: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



టేక్మాల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందంటూ నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, ఎంతోమంది రైతులకు మేలు జరిగే కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ పార్టీని బదనాం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమై అసత్య ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. నాయకులు సిద్ధయ్య, భాస్కర్, రాజేందర్, సుధాకర్, ఈశ్వరప్ప, రాజుగౌడ్, సాయిబాబ, మహేందర్, మతిన్, సురేశ్, మల్లేశం, బసంత్‌రావ్, సంగయ్య, రజాక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాస్తారోకో

అల్లాదుర్గం(మెదక్): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టేందుకు సీబీఐ విచారణకు ఆదేశించడంపై పార్టీ ఆదేశాల మేరకు అల్లాదుర్గంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఆందోళన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులను ఎస్ఐ శంకర్ అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, బేతయ్య, కృష్ణగౌడ్, పవన్, నర్సప్ప, నర్సింలు, అశోక్‌గౌడ్, శివరాం, రమేశ్ పాల్గొన్నారు.

గణపతి మండపం వద్ద హోమం



గణపతి మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న



వినాయక మండపంలో హస్నొద్దీన్, సీఐ, తదితరులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మంగళవారం హోమం నిర్వహించారు. అర్చకులు దిగంబర శర్మ,శేషాద్రిశర్మల ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. నరేందర్‌గౌడ్, రాజేశ్వర్ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించారు. మహిళలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మతసామర్యం వెల్లివిరిసే..

రామాయంపేట(మెదక్): మతసామరస్యం వెల్లివిరిసింది. ముస్లిం యువకుడు రామాయంపేటలోని వినాయకుని మండపంవద్ద అన్నదానం చేశారు. పట్టణంలోని మూడో వార్డులో ఎల్లమ్మ మందిరం వద్ద కాలనీవాసులు వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే కాలనీకి చెందిన హస్నొద్దీన్ అనే యువకుడు మంటపం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా హస్నొద్దీన్‌ను కాలనీవాసులతోపాటు సీఐ, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్ తదితరులు సన్మానించి ప్రశంసించారు.



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చన

సామూహిక కుంకుమార్చన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్థానిక మాధవనగర్‌లో కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు ఆయా మండపాల వద్ద భక్తులు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా అజ్గర్, ఉపాధ్యక్షుడుగా నవీన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జీడీ. చంద్రకాంత్‌గౌడ్, కోశాధికారి బండారి సిద్ధరాములు, సహాయ కార్యదర్శిలుగా బాలరాజ్, శ్రీకాంత్, సలహాదారులుగా భైరవరెడ్డి, భరత్ రెడ్డి, ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిజాంపేట మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా అజ్గర్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు డబుల్ బెడ్ రూమ్, ఇళ్ల స్థలాల విషయంలో అందరికీ న్యాయం చేసేలా ముందుకెళ్తామన్నారు.



నిజాంపేట టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల నూతన కార్యవర్గం